## క్లుప్తంగా

### మండల ప్రత్యేక ఆహ్వానితుడిగా బాబా



మురళీధర్‌బాబాను సన్మానిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితునిగా మాడుగుల మురళీధర్ బాబాను నియమిస్తూ శనివారం ఎంపీడీవో కుమార్ పట్నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీపీ మొదలవలస చిరంజీవి నియామక పత్రం అందజేశారు. అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బెండు రామారావు, బొడ్డేపల్లి సుధాకర్, పి.నర సింహమూర్తి, ఎస్. శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

### ముస్లింలకు రంజాన్ తోఫా



తోఫా కిట్లు అందిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్

శ్రీకాకుళం కల్చరల్: రంజాన్ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు శనివారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో చైర్మన్ పి.జగన్మోహనరావు సమక్షంలో ఎనిమిది కుటుంబాలకు బియ్యం, దుప్పట్లు, హైజీన్ కిట్లు, తువ్వాళ్లు అందజేశారు. రెడ్‌క్రాస్ సభ్యులు దుర్గా శ్రీనివాసరావు, నిక్కు అప్పన్న, సాయి ప్రకాష్, ఆశా తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ



తహసీల్దార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

లావేరు: శ్రీకాకుళం తహసీల్దార్ నిడిగంట్ల వెంకటరావు తల్లి దుర్గమ్మ, భార్య పద్మజ ఈ నెల 11న మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తహసీల్దార్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ప్రముఖ వైద్యుడు దానేటి శ్రీధర్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, లావేరు-2 ఎంపీటీసీ ఇనపకుర్తి సతీష్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, నాయకులు జరుగుళ్ల శంకరరావు, నేతింటి నీలమప్పడు తదితరులు శనివారం పరామర్శించి సంతాపం తెలియజేశారు.

### ఘనంగా సీతారాముల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సనాతన భాగవత భక్త సమాజం నేతృత్వంలో సీతారాముల కల్యాణోత్సవం శనివారం ఘనంగా జరిగింది. మంత్రపుష్పం, దర్బారు సేవ, చతుర్వేద స్వస్తి, మంగళహారతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### మాజీ ఎంపీటీసీ మృతికి సంతాపం



గురువులు రెడ్డి(ఫైల్)

రణస్థలం: మండలంలోని చిల్లపేట రాజాం మాజీ ఎంపీటీసీ సభ్యుడు, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, సీనియర్ కళాకారుడు ఆళ్ల గురువులు రెడ్డి శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈయన మృతి పట్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయి కుమార్ సంతాపం తెలిపారు.

### యూహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా రామ్‌గోపాల్



కల్లేపల్లి రామ్‌గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: నగరంలోని ఆదివారంపేట అర్బన్ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రామ్‌గోపాల్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను చైర్మన్‌గా నియమించేందుకు సిఫారసు చేసిన మంత్రి ధర్మాన ప్రసాదరావుకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా రైట్ ఫోరమ్స్ అధ్యక్షుడు కంఠవేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి యజ్జల గురుమూర్తి, అరసవల్లి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముద్దాడ అప్పలనాయుడు, అర్బన్ మెడికల్ అధికారి డాక్టర్ జంపు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### చిల్డ్రన్ క్లబ్‌తో విజ్ఞానం

ఎచ్చెర్ల: చిల్డ్రన్ క్లబ్‌తో విజ్ఞానం, వినోదం కలుగుతుందని ధర్మవరం శాఖా గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖరరావు అన్నారు. శనివారం గ్రంథాలయంలో చిల్డ్రన్ క్లబ్ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సహాయకులు బి.సూర్యనారాయణ, హెచ్‌ఎం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అవగాహన



రణస్థలం: మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

- కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది
- జాగ్రత్తలు పాటించాలని సూచన

శ్రీకాకుళం క్రైమ్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా అగ్నిమాపక అధికారి బి.వీరభద్రరావు ఆదేశాల మేరకు సహాయ అధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలోని సిబ్బంది శనివారం నగరంలోని పలు పెట్రోల్ బంక్‌లు, పాఠశాలలు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్, వాణిజ్య సముదాయాల వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- గృహాలకు సంబంధించి ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైర్లనే వాడాలి. పాడైన వైర్లను వాడి ఓవర్‌లోడ్ వేయకూడదు. ఎలక్ట్రికల్ సాకెట్‌లో కెపాసిటీకి తగిన ప్లగ్‌ను మాత్రమే వాడాలి. ఎక్కువ రోజులు ఇల్లు వదిలి వెళ్లినప్పుడు మెయిన్ ఆఫ్ చేయాలి. చిన్నపిల్లలను వంటగదులకు దూరంగా ఉంచాలి. గ్యాస్‌ను వాడేశాక రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. నాణ్యత గల ట్యూబ్ ఉండాలి.
- పాఠశాలలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్‌లో ఫైర్ అలారం, స్మోక్ డిటెక్టర్లు అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటుచేయాలి. ఎలక్ట్రికల్ షార్ట్‌సర్క్యూట్ జరగకుండా మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్స్‌ను అమర్చాలి. ప్రమాద ఆస్కార ప్రదేశాలను ముందుగా గుర్తించి అగ్నిప్రమాద రహితం చేయాలి. ఫ్లేమ్ ప్రూఫ్, మోటార్ స్పార్క్ స్విచ్‌లను మాత్రమే ఉపయోగించాలి. ఫైర్ ఎవాక్యుయేషన్ డ్రిల్‌ను ప్రతి మూడు నెలలకోసారి ప్రాక్టీసు చేయాలి.
- గోదాములు, గిడ్డంగులకు సంబంధించి స్టాకును చెక్క స్లాపర్లపై నిల్వచేయాలి. వస్తువులను వేర్వేరుగా స్టోరేజ్ అరల్లో నిల్వచేసి మధ్యలో గ్యాంగ్‌వే, క్రాస్ సెక్షన్లు ఉంచాలి. 4.5 మీటర్ల ఎత్తుకంటే ఎక్కువలో వస్తువులు నిల్వ చేయకూడదు.
- గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా ఎండిన గడ్డిని వాములుగా చిన్నవి వేయాలి. వీటికి నివాస గృహాలకు 60 అడుగుల దూరంలో ఉంచాలి.
- కర్మాగారాల్లో కార్మికులకు బేసిక్ ఫైర్ ఫైటింగ్‌లో శిక్షణనివ్వాలి. మిషనరీ బెల్టులు, పుల్లీలు, విద్యుత్తు పరికరాల నుంచి నిప్పు రాలకుండా జాగ్రత్తపడాలి. సర్క్యూట్‌లను ఓవర్‌లోడ్ చేయాలి.
- విద్యుత్తు ప్రమాదాల సమయంలో నీటిని ఉపయోగించరాదు. పొడి ఇసుకను మాత్రమే వాడాలి. మెయిన్ స్విచ్ ఆఫ్ చేశాకే అగ్నిని ఆపే ప్రయత్నం చేయాలి. విద్యుత్తు ప్రవహిస్తున్న వైర్లు, తీగలపై అత్యవసర పరిస్థితుల్లో కార్బన్ డయాక్సైడ్ ఎక్స్‌ట్వింగిషర్‌ను ఉపయోగించాలి.

అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రణస్థలం అగ్నిమాపక అధికారి పైలా అశోక్ సూచించారు. రణస్థలంలో శనివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బహిరంగ ప్రదేశాలు, థియేటర్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక పరికరాలు వాడే విధానం వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకాకుళం క్రైమ్: పాతబస్టాండ్ వద్ద పెట్రోల్ బంక్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



శ్రీకాకుళం క్రైమ్: దుకాణాల సముదాయం వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తూ..

# జ్యోతిష పండితులకు సత్కారం



జ్యోతిష పండితులను సత్కరించిన మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం కల్చరల్: సమాజహితమైనది జ్యోతిష శాస్త్రమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. బాపూజీ కళామందిర్‌లో జ్యోతిష విజ్ఞాన వాటిక(అంతర్జాతీయ), రోటరీ సెంట్రల్ సంయుక్త నిర్వహణలో శనివారం సాహిత్య జ్యోతిష్యసభా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిని జాగృతపరిచే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం సుసరాపు గణపతిశర్మ(కోటబొమ్మాళి), జ్యోష్యుల గోవిందశర్మ(హిరమండలం), ధర్మపురి అనిల్‌శర్మ(పలాస), వేమూరి రాధాకృష్ణశర్మ(ఆదపాక), భాస్కరభట్ల లక్ష్మీగణపతిశర్మ (శుభలయ్ కాలనీ), ఎన్.విశ్వనాథశర్మ(పలాస), భాస్కరభట్ల బాలకృష్ణశర్మ(బరంపురం), తెన్నేటి విక్రమశర్మ(శ్రీకాకుళం), పాలవలస రామకృష్ణారావుశర్మ(టెక్కలిపట్నం), ఎం.వి.నాగేశ్వర శర్మ (పాలకొండ), అంపోలు కేశవశర్మ (బూర్జ), బంకుపల్లి సురేష్‌బాబు (చాకిపల్లి కొత్తూరు)లను మంత్రి చేతుల మీదుగా సత్కరించారు. అనంతరం మంత్రిని కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఖండ్యాం శ్రీవిద్యాపీఠం ఉపాసకులు అంపోలు రుద్రకోటేశ్వరశర్మ, ధర్మపురి గౌరీశంకరశాస్త్రి, ఆర్.వి.ఆర్.ఎస్.ప్రసాదశర్మ, బూరాడ ఈశ్వర సాయిశర్మ, కొంచాడ సోమేశ్వరరావు, వరదా కొండబాబు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, ఎస్.జోగినాయుడు, నారాయణరావు, కొండాల గణేష్, అరసవిల్లి ఆలయ ట్రస్టు సభ్యులు మండవిల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

### పౌర సరఫరాల గోదాం ప్రారంభం



గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్

లావేరు: బొడ్డపాడు వద్ద రూ.70 లక్షలతో నిర్మించిన పౌర సరఫరాల సరుకుల నిల్వల గోదామును శనివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లావేరు, రణస్థలం మండలాలకు సరఫరా చేసే రేషన్ సరుకులను నిల్వ చేసేందుకు గోదాం నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మేనేజరు దమయంతి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, లావేరు-2 ఎంపీటీసీ ఇనపకుర్తి సతీష్, డీటీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

### వెంకన్నకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిన్నబజారులో వేంకటేశ్వర దేవాలయంలో శనివారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామివారిని తులసిమాలలు, పూలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో 'విషు' వేడుకలు



బలగలో అయ్యప్పస్వామికి అలంకరణ



పాతశ్రీకాకుళంలో అయ్యప్పకు అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయాల్లో కేరళ ఉగాది (విషు) వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో అర్చకులు శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి మూలమంత్ర విషుక్కని సమర్పించారు. పట్టణంలోని కేరళీయులు కని(దీపం) దర్శనానికి విచ్చేసి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. నూతన వస్త్రాలు, ప్రత్యేక ఆభరాణలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి చిరంజీవులు, దానేటి రాజారావు, భక్తులు పాల్గొన్నారు.

కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ధర్మశాస్తా ఆలయంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి. మావుదూరి బాల భాస్కరశాస్త్రి అర్చకత్వంలో 108 కడవలతో పాలాభిషేకం నిర్వహించారు. 2500 నూతన నాణేలతో దివ్య సహస్ర ప్రథమ సంధ్యాపూర్వక హిరణ్యాభిషేకాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు, కమిటీ అధ్యక్షులు వూణ్ణ సర్వేశ్వరరావు, కార్యదర్శి పాపారావు గురుస్వామి, వరహాలు స్వామి, బరాటం సంతోష్, ఎఫ్‌సీఐ రాజు గురుస్వామి పాల్గొన్నారు.

అయ్యప్పస్వామిని దర్శించుకున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం కల్చరల్:పాతశ్రీకాకుళంలోని ధర్మశాస్తా ఆలయంలో అయ్యప్పస్వామిని మంత్రి ధర్మాన ప్రసాదరావు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు, వూణ్ణ సర్వేశ్వరరావు, పాపారావు గురుస్వామి పాల్గొన్నారు.

# అలరించిన అష్టావధానం



అష్టావధానం నిర్వహిస్తున్న పండితులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో జ్యోతిష విజ్ఞాన వేదిక, రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సంయుక్త నిర్వహణలో శోభకృత్ వసంతోత్సవ సాహిత్య, జ్యోతిష్య సభా వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అష్టావధానాలు చక్కగా ఆకట్టుకున్నాయి. ముందుగా నేదూరి శ్రీనివాస్ బృందం నాదస్వర కచేరి జరిగింది. అనంతరం బంకుపల్లి రమేశ్ శర్మ సభా సంచాలకులుగా అవధాని సుసరాపు చంద్రశేఖర శర్మ, అవధాని రంపా సాయికుమార్ శర్మల అష్టావధాన ప్రక్రియ చక్కగా సాగింది. ప్రాశ్నికులుగా భాస్కరభట్ల శ్రీరామశర్మ, ధర్మపురి గౌరీశంకరశాస్త్రి, నేతేటి గణేశ్వరరావు, డాక్టర్ పిలకా శాంతమ్మ, ఇప్పిలి వేణుగోపాలరావు, వేమకోటి శాంతారావు, బందరు దుర్గా ప్రసాద్, రెడ్డి పద్మావతి, నిరంజన్ శతపతిలు వ్యవహరించారు. చక్కనైన యతిప్రాసలతో, నిషిద్ధాక్షరి, దత్తపది, సమస్యా పూరణలు సాగాయి.

# గడప గడపకు సంక్షేమం



గోవిందరావును సత్కరిస్తున్న హరిసూర్యప్రకాష్

ఎచ్చెర్ల క్యాంపస్: అర్హతే ప్రామాణికంగా గడప గడపకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కేశవరావుపేట గ్రామ సచివాలయం పరిధిలోని కింతలి మిల్లు, లక్ష్మిడిపేట, రాజీవ్‌నగర్ కాలనీల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత పాలనను పోల్చి చూడాలన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు పెత్తనం ఉండేదన్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయం, గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా పార్టీలకు అతీతంగా పథకాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బల్లాడ హేమమాలినీ రెడ్డి, హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్, పీఆర్ ఏఈ రాజేంద్రప్రసాద్, ఏఓ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, వెలుగు ఏపీఎం రామ్మూర్తి, ఉపాధి ఏపీవో శోభాదేవి, నాయకులు, ప్రజాప్రతినిధులు పైడి భాస్కరరావు, జరుగుళ్ల శంకరరావు, మూగి శ్రీరాములు, సనపల నారాయణరావు, బల్లాడ జనార్దనరెడ్డి, మాడుగుల మురళీధర్ బాబా, బోర సాయిరాం, రామారావు, సూర్యారావు, నర్సింగరావు, అనూరాధ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## ఆలయ ధర్మకర్తగా గోవిందరావు ప్రమాణ స్వీకారం



గోవిందరావును సత్కరిస్తున్న హరిసూర్యప్రకాష్

అరసవల్లి: ఆలయ అభివృద్ధికి తనవంతుగా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని ధర్మకర్త లుకలాపు గోవిందరావు ప్రకటించారు. శనివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అనివెట్టి మండపంలో ధర్మకర్తగా ప్రమాణ స్వీకారం చేశారు. గత నెల 28న నూతన పాలక మండలి (ధర్మకర్త) ప్రమాణ స్వీకారం జరగ్గా, అనివార్య కారణాలతో గోవిందరావు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకాలేదు. దీంతో శనివారం జిల్లా దేవదాయ శాఖాధికారి వి.హరిసూర్యప్రకాష్ ఆయనతో ప్రమాణ స్వీకారాన్ని చేయించి ఆలయం తరఫున సత్కరించారు. కార్యక్రమంలో ఎక్స్‌అఫీసియో మెంబర్ ఇప్పిలి శంకరశర్మ, ధర్మకర్తలు మండవల్లి రవి, ఎస్.కోటేశ్వర చౌదరి, డాక్టర్ కె.సోమేశ్వరరావు, ద్వారపు అనూరాధ, జె.శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు. కొత్తగా ధర్మకర్త బాధ్యతలు స్వీకరించిన గోవిందరావుకు తూర్పుకాపు సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్, సురంగి మోహనరావు, సంఘ నేతలు ఘనంగా సత్కరించారు.

## వినియోగదారులకు నాణ్యమైన సేవలు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోల్, డీజిల్ అమ్మకాలు చేపట్టి వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. అరసవల్లిలోని డీసీఎంఎస్ కార్యాలయ ప్రాంగణంలో సూర్యదేవ హెచ్‌పీ సర్వీస్ సెంటర్ పేరిట ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను మంత్రి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సల్లా సుగుణ దేవరాజ్, డీసీఎంఎస్ సహకార అధికారి శీలం సుబ్బారావు, బిజినెస్ మేనేజర్ పొందర లక్ష్మణ రావు, మేనేజర్ మార్పు జగ్గునాయుడు, సహకార శాఖ ప్రతినిధులు, డిస్ట్రిక్ట్ కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ప్రతినిధులు, సివిల్ సప్లయిస్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



జి.సిగడాం: సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి వెంకటిసాయి

జి.సిగడాం: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఆర్‌బీకే సిబ్బంది అంకితభావంతో పని చేయాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ అన్నారు. శనివారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు, అందుబాటులో ఉంచాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో వ్యవసాయాధికారి వై.శారద, ఉద్యాన అధికారి అనూష, పశు వైద్యాధికారి ఉప్పాడ సుమన్, ఏఈఓలు కంబాల జగదేశ్వరరావు, కొమ్ము అప్పారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు అలుగోలు లక్ష్మినారాయణ, కుమరాపు సుగుణాకరరావు, ముంతా హేమంత్‌కుమార్, బి.రాణి, అంపోలు అనూష, సత్యనారాయణ, అరసవిల్లి దివ్య, సింహాద్రి హరికృష్ణ, పాగిరి నారాయణరావు పాల్గొన్నారు.

పక్కాగా ఖరీఫ్ ప్రణాళిక..

ఎచ్చెర్ల క్యాంపస్: ఖరీఫ్ ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ సక్రమంగా నమోదు చేయాలన్నారు. నారాయణపురం కుడికాలువ ద్వారా శివారు భూములకు సాగునీరు అందేలా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బొడ్డేపల్లి సుధాకర్, ఎంపీడీఓ కుమార్ పట్నాయక్, వ్యవసాయాధికారి సురేష్, పశు వైద్యుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## కణితి మృతికి సంతాపం

శ్రీకాకుళం న్యూకాలనీ: బీజేపీ నాయకుడు, ఏపీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ కణితి విశ్వనాథం మృతి పట్ల పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శి శవ్వాన ఉమామహేశ్వరి, వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు కణితి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు



జి.సిగడాం: చెట్టుపొదిలాంలో పథకాలు వివరిస్తున్న సర్పంచ్, కన్వీనర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కులమతాలకు అతీతంగా రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. శనివారం నగరంలోని చౌదరి సత్యనారాయణ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్న స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సహకరించాలని, ఏవైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గనిరాజు, అరుణమ్మ, తారక్, అప్పన్న, బుడుమూరు రాజేష్, జ్యోతి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని చెట్టుపొదిలాం, పెంట గ్రామాల్లో సర్పంచులు భూపతి సురేష్ కుమార్, పున్నాన అక్కలనాయుడు, ఎంపీటీసీ సభ్యులు మక్క శ్రీలత, పట్నాన శాంతి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరించారు.

రణస్థలం: జె.ఆర్.పురం పంచాయతీలో సర్పంచ్ బవిరి రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు దన్నాన సీతారాం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు.



రణస్థలం: జె.ఆర్.పురంలో స్టిక్కర్ అతికిస్తున్న దన్నాన సీతారాం



జి.సిగడాం: పెంట గ్రామంలో పథకాలు వివరిస్తున్న నాయకులు